www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 6 జనవరి 2025

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవాలని పేర్కొన్నారు. అలాగే డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10.00 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని తెలిపారు

హడలెత్తిస్తున్న ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు

అదనపు భారాలతో జనం బెంబేలు
వినియోగించిన విద్యుత్‌కు.. బిల్లుకు మధ్య భారీ తేడా
దిక్కుతోచని స్థితిలో విద్యుత్ వినియోగదారులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యుత్ ఛార్జీల భారం మోయలేక జనం అల్లాడిపోతున్నారు. గత ప్రభుత్వం తప్పిదమంటూ కూటమి ప్రభుత్వం తప్పించుకునే పనిలో పడగా, ఈ భారమంతా కూటమి ప్రభుత్వానిదేనంటూ వైసిపి తీవ్ర విమర్శలు చేసుకుంటూ జనాల నెత్తిన భారాలు మోపి ఇరుపార్టీలు వికటాట్టహాసం చేస్తున్న పరిస్థితి నెలకొంది. వాడుకున్న విద్యుత్‌కు వస్తున్న కరెంటు బిల్లులకు ఏమాత్రమూ సంబంధం లేకుండా జనాలు లబోదిబోమంటున్న పరిస్థితి ఏర్పడింది. రూ.697 కరెంటు బిల్లులో అదనపు ఛార్జీల భారం రూ.337 ఉన్న పరిస్థితి నెలకొంది. బిల్లులో సగం వరకూ అదనపు ఛార్జీల భారాన్ని జనం నెత్తిన రుద్దిన దుస్థితి కొనసాగుతోంది. జిల్లాలో 12 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతుల విద్యుత్ కనెక్షన్లు సామాన్య ప్రజానీకానికి సంబంధించినవే. డిసెంబర్ కరెంటు బిల్లులతోనే జనం తీవ్ర ఆందోళన చెందగా జనవరి నెల బిల్లులు మరింత షాక్ కొడుతున్న పరిస్థితి నెలకొంది. డిసెంబర్ నెలలో ఎఫ్‌పిపిసిఎ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చస్ కాస్ట్ అడ్జస్టెట్మెంట్) ఛార్జీలు రెండు ఉండగా, జనవరిలో నెలలో ఎఫ్‌పిసిఎల భారాలు మూడుకు చేరాయి. దీంతో బిల్లులు మోతమోగుతున్న పరిస్థితి నెల కొంది. 2022-23,2023-24 సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ పంపి ణీలో అదనపు ఖర్చుల పేరుతో జనాలపై విద్యుత్ బిల్లుల బాదుడు తారా స్థాయికి చేరింది. విద్యుత్ బిల్లులో సగం అదనపు ఛార్జీల భారమే ఉంటుంది. గత వైసిపి పాలనలో ఏడుసార్లు అదనపు ఛార్జీల భారం వడ్డించగా, కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరునెల్లోనూ రెండు అదనపు ఛార్జీల భారం మోపింది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ వరుస విద్యుత్ ఛార్జీల వడ్డన సాగిస్తోంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. చలి విపరీతంగా ఉండడంతో ఫ్యాన్ కూడా వేసుకోలేని పరిస్థితి ఉంది. ఇక ఎసిల ఊసే లేకుండా పోయింది. కానీ కరెంటు బిల్లులు మాత్రం ఏమాత్రమూ తగ్గలేదు. ఎపిపిపిసిఎ భారాలే ఇందుకు ప్రధాన కారణం.



సంక్షేమం ముసుగు.. భారాల బాదుడు

ప్రజలకు పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం మరోపక్క భారాలను మాత్రం విపరీతంగా మోపుతోంది. గడిచిన ఆరు నెలల్లోనే రెండు ఎఫ్‌పిపిసిఎ విద్యుత్ భారాలను జనాలపై మోపింది. వంట నూనె నుంచి పప్పుల నుంచి ఇతర నిత్యావస్తువుల ధరలన్నీ ఆకాశాన్నంటాయి. గతంలో నెలవారీ నిత్యావసర ఖర్చులకు రూ.రెండు వేలు అయితే ఇప్పుడు రూ.ఐదు వేలు అవుతోంది. అడ్డూ అదుపులేని ధరలతో జనం ఇబ్బందులు పడుతుండగా కరెంటు ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం మరింత దారుణంగా హింసిస్తోంది. కరెంటు బిల్లులో ఫిక్స్, కస్టమర్, ఈడి, సర్‌ఛార్జీలు, ఎపిపిపిసిఎ ఛార్జీల మోత మోగిపోతుంది. జనవరి మూడో తేదీ నుంచి కరెంటు బిల్లులు తీయడం ఆరంభమైంది. బిల్లులు చూసి జనం షాక్ తింటున్నారు. పులివెందుల పట్టణంలో ఒక ఇంటికి వాడిన విద్యుత్‌కు రూ.473 బిల్లురాగా ఎఫ్‌పిపిసిఎ భారం రూ.214 ఉంది. డిసెంబర్ నెలలో ఎల్‌పిసిఎ, ఎఫ్ పిపిసిఎ 2 భారాలు మాత్రమే ఉండగా జనవరిలో తీస్తున్న బిల్లులో ఎఫ్ పిపిసిఎ 3 భారం కలిసింది. దీంతో బిల్లుల మోత మోగిపోతున్నాయి. విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రభుత్వం జనాలను పీల్చిపిప్పి చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చినట్లే ఇచ్చి.. ఇతర రూపాల్లో గుంజుకుంటుందున్న చర్చ ప్రజల్లో నెల కొంది. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఇక నుంచి అదనపు ఛార్జీల భారాన్ని ఏ నెలకు ఆ నెలలో వసూలు చేయాలన్న ఆలోచన సైతం విద్యుత్ శాఖ, ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ వాడకున్నా అధిక బిల్లులు

చలికాలం కావడంవల్ల ఫ్యాను వేసుకోకపోయినా బిల్లు మాత్రం వస్తుంది. బిల్లు ఎంత వస్తుందో అదనపు ఛార్జీలు అంత వేయడం వల్ల బిల్లు రెట్టింపు అవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం వీటిపై ఆలోచించాలి.

- ఉమాదేవి, గృహిణి , పులివెందుల

భారమవుతున్న విద్యుత్ ఛార్జీలు

కూలీ పనికి పోయి ఇంటి అద్దె కట్టలేని పరిస్థితి. దీంతో అధిక విద్యుత్ ఛార్జీలు భారంగా మారుతున్నాయి. ఎక్కువ బిల్లు వచ్చే వారిపై అదనపు చార్జీలు విధిస్తే బాగుంటుంది. కానీ తక్కువ బిల్లు వచ్చే వాళ్లపై కూడా విధించడం వల్ల పేదవాళ్ల కు మరింత భారం పడే అవకాశం ఉంది.

- సావిత్రి , వ్యవసాయ కూలీ, పులివెందుల

కేంద్ర మంత్రి అమిత్‌షా మత విద్వేషి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వికృత సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మత విద్వేషపు అజెండాను అమలు చేస్తున్న కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ, ఎన్‌డిఎ ప్రభుత్వం, హోం మంత్రి అమిత్‌షా మత విద్వేష పరిపాలన రాజ్యాంగ ద్రోహమేనని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, కడప నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టి.కె. అఫ్జల్ ఖాన్ పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలు, ప్రజాస్వామ్యంపై అమానుష దాడులు చేస్తోందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ దశల వారి ఉద్యమాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో పిసిసి అధ్యక్షులు షర్మిల నాయకత్వంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు 'జై బాపు - జై భీమ్ - జై సంవిధాన్' అనే ఉద్యమం పేరిట కాంగ్రెస్ పార్టీ వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనలు ఉద్యమంలో భాగంగా చేపట్టనున్నట్లు వివరించారు. త్వరలో కడప జిల్లాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలు, ధర్నాలు చేసి విగ్రహానికి వినతి పత్రం సమర్పించడం జరుగుతుందన్నారు. పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై హోం మంత్రి అమిత్‌షా చేసిన అమానుషకరమైన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ వివిధ దశల్లో ఆందోళన చేపట్టిందన్నారు. బేషరతుగా అమిత్ షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సెక్యులర్ వాదులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాలు కూడా నిర్వహించేందుకు పార్టీ సన్నాహాలు చేస్తుందన్నారు. సమావేశంలో కడప నగర డివిజన్ నేతలు ఆసిఫ్ ఖాన్, జహూర్, హమీద్ పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయులు అలీ సేవలు అమూల్యం

ప్రజాశక్తి -కడప అర్బన్

ఆదర్శ ఉపాధ్యాయులు అస్గర్ అలీ సేవలు అమూల్యమని, 38 సంవత్సరాలుగా ఎంతోమంది విద్యార్థిని, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం.డి ఇలియాస్ బాష కొనియాడారు. ఆదివారం నగరంలోని సుల్తాన్ ఫంక్షన్ హాల్లో అస్గర్ అలీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. అమృత నగర్ జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీహరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన విషయంలో అస్గర్ అలీ అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఉర్దూ మాధ్యమ విద్యార్థులకు ఉర్దూ మెటీరియల్ అందుబాటులో లేని కారణంగా అనువాదం చేసి ముద్రించి ఉచితంగా పంపిణీ చేశారన్నారు. తన అభిమాన గురువు అస్గర్ అలీ కు ఆయన శిష్యుడు, రూట రాష్ట్ర కోఆర్డినేటర్ ముహమ్మద్ అయ్యూబ్, నాయకులు సయ్యద్ సిరాజుద్దీన్, మస్తాన్ వలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి జుబేర్ అహ్మద్ లతో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా, ఆర్ యు పి పి జిల్లా అధ్యక్షులు ఎఫ్ఎంఎస్ ఖాదర్, అస్గర్ అలీ గతంలో పనిచేసిన ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, శిష్యులు, బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న అతిథులు

హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న మేకల శివార్జున

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగ ఉపా ధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్, మెరుగైన పిఆర్‌సి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారన్నారు. ఇచ్చిన వాగ్దానం మేరకు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం 30శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. రెండు పెండింగ్ డిఎలు కూడా ప్రభుత్వం ప్రకటించకపోవడం చాలా బాధాకరమని అన్నారు. వెంటనే పెండింగ్ డిఏలను ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.గంగరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు సి.సుదర్శన్ బాబు పాల్గొన్నారు.

7 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ : ఎస్ఇ

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ రమణ

2025-26 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ ఛార్జీలు (టారిఫ్) ప్రతిపాదనలపై ఈనెల 7,8, 10 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపి ఇఆర్‌సి) ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఎపిఎస్‌పి డిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్. రమణ తెలిపారు. ఆదివారం సాయంత్రం కడప విద్యుత్ భవన్ లోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ పంపిణీ సంస్థలు ఎపి ఇఆర్‌సికి సమర్పించిన వార్షిక ఆదాయ, అవసరాల నివేదిక పై 7, 8 తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలో ఎ కన్వెన్షన్ సెంటర్లో, 10న కర్నూలు ఎపి ఇఆర్‌సికార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తారన్నారు. వినియోగదారులు తమ అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు. ఎపి ఇఆర్‌సి చైర్మన్ ఠాగూర్ రామ్ సింగ్, ఇంధన శాఖ, ట్రాన్స్‌కో, జెన్‌కోఅధికారులు పాల్గొంటారు అని తెలియజేశారు.

డిఇఒ మీనాక్షిని వెంటనే తొలగించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్: జిల్లాలో రోజు ఏదొక పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుల ఆత్మఆత్మాభిమానాన్ని దెబ్బతినే విధంగా తిట్లు తిడుతూ కించపరిచే విధంగా ప్రవర్తిస్తున్న డిఇఒ మీనాక్షి పై జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ జోక్యం చేసుకుని తొలగించాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పిడిఎస్‌యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా చరిత్రలోనే 24 ఉపాధ్యాయ సంఘాలు ఒక్కటిగా చేరి డిఇఒ మీనాక్షిని తొలగించాలని డిమాండ్ చేయడం ఇదే తొలిసారి అన్నారు. డిఇఒ మీనాక్షిని జిల్లాలో ఏ పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు భయపడే పరిస్థితి ప్రస్తుతం ఉందన్నారు. డిఇఒ, సర్వ శిక్ష అభియాన్‌లో పని చేసే సిబ్బందిని బూతులు తిడుతూ వేధిస్తున్నారని చెప్పారు. ప్రయివేట్ స్కూల్ అనుమతుల్లో, ఓపెన్ ప్రయివేట్ స్టడీ సెంటర్ల దగ్గర లక్షలాది రూపాయలు డబ్బులు తీసుకుందని ఆరోపణలు ఉన్నాయన్నారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రభుత్వం జోక్యం చేసుకుని సరెండర్ చేయాలన్నారు. సమావేశంలో పిడియస్ యు జిల్లా నాయకుడు మనోజ్,అన్నమయ్య జిల్లా నాయకుడు మహేష్ పాల్గొన్నారు.

ప్రజా పునాదిని విస్తరించుకోవాలి

ప్రజా సమస్యలపై పోరాటాలే ఎజెండాగా ప్రజాపునాదిని విస్తరించుకోవడమే లక్ష్యంగా పని చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. రెండ్రోజులుగా కడప జిల్లా కేంద్రంగా జరుగుతున్న సిపిఎం జిల్లా 12వ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. శని, ఆది వారం కడప జిల్లాలో మహాసభలు నిర్వహించారు. మొదటిరోజు భారీ ర్యాలీ, బహిరంగసభ నిర్వహించగా, రెండవరోజు కామ్రేడ్ సీతారాం ఏచూరిప్రాంగణం(అజ్మత్‌ఫంక్షన్)లో ప్రతినిధుల సభ నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి పరిశీలకులుగా హాజరయ్యారు. రెండ్రోజులుగా పలు అంశాలపై జరిగిన చర్చలను నిశితంగా పరిశీలించారు. పార్టీ గత మూడేళ్లలో చేపట్టిన కార్యక్రమాలు, విజ యాలపై చర్చించి, భవిష్యత్ కార్యక్రమాలను దిశానిర్దేశం చేశారు.

- మహాసభలో సిపిఎం నాయకుల వెల్లడి
- ఘనంగా ముగిసిన సిపిఎం జిల్లా12వ మహాసభ
- జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చోపచర్చలు
- భవిష్యత్ కర్తవ్యాలపై దిశానిర్దేశం
- చైతన్యం,ఉద్యమస్ఫూర్తితో సాగిన మహాసభ

ఐక్యత చాటుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ కడప అర్బన్

కడపలో రెండ్రోజులపాటు సిపిఎం జిల్లా మహాసభలు ఉత్సాహంగా ఉల్లాసంగా సాగాయి. రాబోయే మూడేళ్లలో చేపట్టాల్సిన భవిష్యత్ కర్తవ్యాలపై నాయకులు చేసిన ప్రసంగాలు సిపిఎం శ్రేణు లను ఉత్సాహపరిచాయి. మహాసభలో అనేక అంశాలపై పలు తీర్మానాలు చేశారు. జిల్లా సమగ్రాభివృద్ధిపై, సాగునీటి ప్రాజెక్టులు విద్య, యువజన, కార్మిక, కర్షక రంగాలు మొదలగు రంగాల సమస్యలపై మహాసభలో చర్చించారు.అనంతరం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దేశాన్ని ఓ అబద్దాల కోరు పాలిస్తున్నారని, కుల,మతాల పేరుతో ప్రజల్లో విద్వేష బీజాలు నాటుతున్నారని విమర్శించారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని పెడదోరణుల్ని విస్తరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి విపరీత ధోరణుల్ని తిప్పికొట్టడానికి అవ సరమైన ఎత్తుగడలను రూపకల్పన చేయాలన్నారు. బిజెపి కుల, మత రాజకీయాలను తిప్పకొట్టి, దేశంలో ఐక్యతను తీసుకొచ్చే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటాలు సాగిస్తూనే పార్టీ పునాదిని విస్తరింపజేయాలని సూచించారు. బిజెపి రాయలసీమ డిక్లరేషన్ పేరుతో, టిడిపి అమరావతి, పోల వరం అజెండాతో ముందుకెళ్తూ, రాయలసీమను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కరువు పీడిత ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వకుండా, ఇష్టానుసారంగా రాజకీయాలు సాగించడం దివాళా కోరుతనమన్నారు. కొప్పర్తి నుంచి ఎంఎస్ఎంఇ, ఎపిబిజి, నార్కోటిక్ డ్రగ్ లీగల్ కోర్టులను తరలించడం దుర్మార్గమని చెప్పారు. వైసిపి నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి భూఆక్రమణల విచారణపై డిప్యూ టీ సిఎం పవన్‌కల్యాణ్‌కు ఉన్న శ్రద్ధ, జిల్లాలో లక్షలాది ఎకరాలు ఆక్రమించుకున్న పెద్దలపై విచారణకు ఎందుకు ఆదేశించరని ప్రశ్నించారు. టిడిపి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని హామీనిచ్చి, భారీగా ఛార్జీలను పెంచడం బాధాకరమని తెలిపారు. పేదలకు భూములు పంపిణీపై దృష్టి సారించి పోరాటాలు రూపొందించాల్సి ఉందన్నారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రైతుల బలవన్మరణాల నిలువరించడం లేదన్నారు. ఎం.ఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసు లను అమలు చేయడంతోపాటు రైతులకు గిట్టుబాటు ధరల కల్పన, అన్‌సెక్యూరిటీ రుణాలు, సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందిస్తే రైతుల ఆత్మహత్యలు ఆగిపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గడిచిన మూడేళ్లలో సిపిఎం అనేక ఆందోళనా కార్యక్రమాలు చేపట్టిందని, వీటిని మరింత ఉధృతంగా చేపట్టడానికి ప్రజా సంఘాలను విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజాసమస్యలపై పోరాటాలే అజెండా పార్టీని బలోపేతం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. కార్మికులు, కర్షకుల తరుపున నిలబడి పోరాటాలను కొనసాగించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. రాబోయే మూడేళ్లలో జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సమష్టిగా పోరాటం చేయాలని చెప్పా రు. అనంతరం 16 మందితో సిపిఎం జిల్లా కమిటీ ఎన్నిక నిర్వ హి ంచారు. ఇందులోని ఐదుగురితో కార్యవర్గం ఎన్నికైంది.

సిపిఎం సీనియర్ నాయకులు ఐ.ఎన్. సుబ్బమ్మను సన్మానిస్తున్న నాయకులు

సిపిఎం సీనియర్ నాయకురాలికి సన్మానం

సిపిఎం సీనియర్ నాయకురాలు ఐ.ఎన్.సుబ్బమ్మకు సన్మానం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, ఇతర నాయకులతో కలిసి శాలువా కప్పి సన్మానం చేశారు. 1986 నుంచి 2025 వరకు 39 ఏళ్లపాటు ఆమె సాగించిన పోరాటాలు శ్లాఘనీ యమన్నారు. ఇంతటి సుదీర్ఘకాలం ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి పని చేయడం ఆదర్శనీయమన్నారు. అంతకు ముందు ఆమె మాట్లాడిన తన తుదిశ్వాస వరకు పార్టీ కోసం సేవలందిస్తూ ఉంటా ననే చిత్తశుద్ధిని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం పోరాటాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

మాట్లాడుతున్న జి.చంద్రశేఖర్

దేశ సమైక్యత సమగ్రత లక్ష్యంగా సిపిఎం జిల్లా మహా సభలు కొన సాగాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొ న్నారు. ఆదివారం రెండవ రోజు కడపలో సిపిఎం కడప జిల్లా 12వ మహా సభలు కొన సాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దేశ సమైక్యత, సమగ్రతలకు ముప్పు తీసుకొచ్చే బిజెపి అధికారంలోకి వచ్చి కొలువుతీరి ఉందనే విషయం దేశ ప్రజలందరూ గుర్తించాలని కోరారు. ప్రజల నుంచి మత ఉన్మాద పార్టీలను, సంస్థలను వేరు పెట్టాలని, లేకుంటే అనేక మతాలు, కులాలు, ఉపకులాలు, భాషలు, సంప్రదాయాలు, సంస్కృతులు కలిగిన భారతదేశం ముక్కలు చక్కగా విడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మనుషులందరూ ఒకటే, వారికి కనీస మౌలిక సౌకర్యాలు ప్రభుత్వాలు సమకూర్చాలనే నినాదంతో దేశ ప్రజలందరినీ ఐక్యంగా ముందుకు నడపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మహాసభలు కడప జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వాల దృష్టికి తీసుకు రావాల్సిన ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వాలపై తీసుకురావాల్సిన ఒత్తిడి, ప్రజా పోరాటాలను రూపొందిస్తుందని పేర్కొన్నారు. మహాసభల్లో సిపిఎం కడప జిల్లా ఇన్‌ఛార్జి ఎం.ఎ. గఫూర్, రాష్ట్ర పరిశీలకులు కె.ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, జి.శివకుమార్, బి.మనోహర్, ఐ.ఎన్.సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరిరెడ్డి, కె.శ్రీనివా సులురెడ్డి, కె.శ్రీనివాసులు, కె.సత్యనారాయణ, బి.లక్ష్మీదేవి, బి.లక్ష్మీ రాజా, వి.అన్వేష్, జమ్మలమడుగు మండల కార్యదర్శి దాసు, కాశినాయన మండలం కార్యదర్శి పోలయ్య, మండల కార్యదర్శి నరసయ్య, పోరుమామిళ్ల మండల కార్యదర్శి ఎన్.భైరవ ప్రసాద్, బద్వేల్ రూరల్ మండల కార్యదర్శి డి. వెంకటేష్, అట్లూరు మండల కార్యదర్శి వెంకటరమణ, కలసపాడు కార్యదర్శి గురవయ్య, బి.కోడూరు మండల కార్యదర్శి ఆర్.ఓబయ్య, సిద్ధవటం మండల కార్యదర్శి సురేష్ బాబు, పెండ్లిమర్రి మండల కార్యదర్శి శ్రీనివాసులు, ఎర్రగుంట్ల మండల కార్యదర్శి పెద్ద బయన్న, మైలవరం మండల కార్యదర్శి కొండయ్య, విద్యార్థి, యువజన, కార్మిక, వ్యవసాయ కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ, మహిళా, మైనార్టీ ప్రజా సంఘాల నాయకులు ప్రతినిధులుగా పాల్గొన్నారు.

జీవో 145ను ఉపసంహరించుకోవాలని వినతి

ప్రజాశక్తి - కడప

జీవో నంబర్ 145ను తక్షణం ఉపసంహరించుకోవాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి న్యాయవాదుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరుతూ ఆదివారం కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ నంద్యాల చిన్నయ్య. గౌతమ్ కుమార్, వేణుగోపాల్ కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి , టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి మీ న్యాయమైన విజ్ఞప్తిని తీసుకువెళుతానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ విప్‌కు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని నకాష్ వీధిలో ఉన్న మస్జిదే రిజ్వాన్‌లో జనతా మెడికేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ ఫిజియోథెరపిస్టు డాక్టర్ షేక్.ఇర్ఫాన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనతా మెడికేర్ ఆధ్వర్యంలో మురికివాడ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు సేవలు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. జనతా మెడికేర్ అధినేత ఫిజీషియన్, షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ షేక్.జుబేర్ అహ్మద్ పాల్గొని వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రతి నెలా చివరి ఆదివారంలో జనతా మెడికేర్ లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనతా మెడికల్ స్టోర్ అధినేత షేక్.రియాజ్ బాషా, జనతా మెడికేర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో అంకితభావంతో మరువలేని సేవలు అందించి 2024 సంవత్సరంలో ఉద్యో విరమణ చేసిన 14 మంది ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) తరపున సత్కరించారు. ఆదివారం స్థానిక బెల్లంమండి వీధిలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, సన్మాన గ్రహీతల బంధువుల సమక్షంలో ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. సందర్భంగా ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీం బాషా మాట్లాడుతూ ప్రభుత్వపరంగా విరమణ చేసినప్పటికీ వీరు ఉపాధ్యాయ వృత్తికి దూరం కారాదని తెలిపారు. వీరి సేవలు సమాజానికి, దేశానికి అవసరమని చెప్పారు.



రమణారెడ్డిని సన్మానిస్తున్న హృషి కేశవరెడ్డి

వైసిపి బలోపేతానికి కృషి చేద్దాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అందరం కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేద్మాని వైసిపి కడప జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వల్లంబాయి హృషి కేశవరెడ్డి పిలుపునిచ్చారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పోచిరెడ్డి వెంకటరమణారెడ్డిని జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడుగా, పార్టీ అధికార ప్రతినిధిగా చిన్నకొమెర్ల నారపురెడ్డి మోహన్‌రెడ్డి, సెక్రటరీ ఆర్గనైజర్స్‌గా సి.లక్ష్మికాంత్‌రెడ్డి, బోనం సురేష్, సెక్రటరీ ఆక్టివిటీగా సాత్రి శీనయ్య, బేపారి షామీర్ అలీ, సుమంత్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం ఖరారు చేసింది. ఇందులో భాగంగా ఆదివారం వైసిపి కడప జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వల్లంబాయి హృషి కేశవరెడ్డి వారిని శాలువా కప్పి అభినందించారు. పార్టీ ఇచ్చిన గౌరవాన్ని నిలుపుకొనేలా పని చేసి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమస్యలను గుర్తించి ముందుకు పోవాలని ఆయన కోరారు. నియమితులైన వారు మాట్లాడుతూ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గాజ శీను, గంగాధర్ పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా చంద్రశేఖర్

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా వేంపల్లె గ్రామానికి చెందిన కటిక చంద్రశేఖర్‌ను నియమిస్తూ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వైసిపి తనకు బాధ్య తలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియ మించినందుకు వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

8న మైదుకూరులో వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - చాపాడు



మాట్లాడుతున్న మణికంఠ

అమ్మ సేవాసమితి, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ పురస్కరించుకొని ఈనెల 8న మైదుకూరు నియోజకవర్గ స్థాయిలో వాలీబాల్ పోటీలు మేధా డిఫెన్స్ క్రీడా మైదానంలో నిర్వహి స్తున్నామని నెహ్రూ కేంద్ర అధికారి మణికంఠ తెలిపారు. ఈ పోటీలను 15 నుంచి 29ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. విజేతలకు ట్రోఫీతోపాటు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి భారత ప్రభుత్వం సర్టిఫికెట్స్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొన దలచిన వారు 85200 01065 నెంబర్‌కు ఫోన్ చేసి వారి టీం పేరును నమోదు చేసుకోవాలని సూచించారు.

నేత్రనిధికి కార్నియాలను అందిస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

నేత్రదానం.. ఇద్దరు అంధులకు చూపు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపువస్తుందని నేత్ర నిధి టెక్నీషియన్ హరీష్ తెలిపారు. పట్టణంలోని జడలమ్మ వీధికి చెందిన యల్ల టూరు మునికాంతమ్మ మరణించడంతో ఆమె భర్త లక్షిరెడ్డి, కుమారులు చిరంజీవిరెడ్డి, గిరినాథరెడ్డి, కుమార్తెలు మారుతీదేవి, హైమావతి దేవి మృతు రాలి నేత్రదానానికి అంగీకరించారు. విషయాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు తెలిపారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి ఇంటివద్దకెళ్లి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సంద ర్భంగా హరీష్ మాట్లాడుతూ బంధువులు, సన్నిహితులు మరణిస్తే వారి నేత్ర దానానికి అంగీకరిస్తే 99666 09364, 70932 04537 నెంబర్లను సంప్ర దించాలన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు బంధు వులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

ఎంపికైన హాకీ క్రీడాకారులు

సబ్ జూనియర్, జూనియర్ జిల్లా హాకీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జిల్లా సబ్ జూనియర్, జూనియర్ హాకీ జట్టను ఆదివారం ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు అరవై మంది క్రీడాకారులు పాల్గొన్నారు. స్థానిక వైఎస్ఆర్ ఇంటిగ్రేట్ హాకీ స్టేడియంలో నిర్వహించిన ఎంపికలో అత్యధికంగా పాల్గొన్న క్రీడాకారుల నుంచి మంచి ప్రతిభ కనబరచిన క్రీడా కారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ పిఇటి కృష్ణమూరి, హాకీ సెక్రటరీ శేఖర్ పర్యవేక్షించారు. క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. చక్కగా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కోచ్‌లు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఖాన్ బాషా, అనిల్ కుమార్, డేవిడ్ కుమార్, ఉదయ్ దీపు, శౌరి కుమార్, దినకర్, రవికుమార్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సర్వేలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సర్వే చేయడంలో గ్రామ సచివాలయంల సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఒ కృష్ణమూర్తి హెచ్చరించారు. ఆ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇళ్ల జియో ట్యాగ్ సర్వే, పిఎసిఎస్, ఎంఎస్ఎంఈ సర్వే చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారన్నారు. అయితే కొంతమంది సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలోని సచివాలయ సిబ్బంది సర్వేలు చేసి నివేదికలను త్వరగా అందజేయాలని ఆయన ఆదేశించారు. సర్వే పూర్తి చేయని సిబ్బందిపై కలెక్టర్ ఆదేశాల మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ హెచ్చరించారు.

అనర్హుల పెన్షన్ తొలగింపును స్వాగతిస్తున్నాం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపిలో అనర్హుల పెన్షన్ తొలగింపు స్వాగతిస్తున్నామని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చిన్న సుబ్బయ్య పేర్కొన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి స్పెషల్ మెడికల్ టీమ్‌లు రంగంలోకి దిగడాన్ని స్వాగతం పలుకుతున్నామని తెలిపారు.

సంక్రాంతి కానుక ఏదీ చంద్రన్నా?

ప్రజాశక్తి- వేంపల్లె

చంద్రబాబు సారథ్యంలో టిడిపి ప్రభుత్వం 2014లో అమలు చేసిన చంద్రన్న సంక్రాంతి కానుకను గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా ఎత్తి వేసింది. టిడిపి పాలనలో పండుగల వేళ కొన్ని సరుకులను లబ్దిదారులకు అందించేవారు. క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. వైసిపి ప్రభుత్వం వాటిని పక్కన పెట్టి కేవలం బియ్యం, పంచదార, కందిపప్పు, మాత్రమే పంపిణీ చేసింది. చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇప్పుడు సంక్రాంతి కానుకల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సంక్రాంతికి చంద్రన్న కానుకను అంద జేస్తారా? లేదా? అనే ప్రశ్నలు సర్వత్రావ్యక్తం అవుతున్నాయి. క్రిస్మస్ కాను కను మరిచిపోయిన కూటమి ప్రభుత్వం సంక్రాంతి కానుకనైనా ఇవ్వాలని పలువురు లబ్దిదారులు కోరుతున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం 2019 వరకు పండుగల వేళ కానుకలు అందించింది. ఒక్కో కార్డుదారునికి ఉచితంగా రూ.207.94 పైసలు విలువ చేసే 6 రకాల వస్తువులు గోధుమ పిండి, శనగపప్పు, బెల్లం, నెయ్యి, పామాయిల్, కందిపప్పును ఒక సంచిలో పంపిణీ చేసేవారు. చంద్రన్న కానుకపై కూటమి ప్రభుత్వం ప్రకటన చేయక పోవడంతో ఈ సంక్రాంతికి ప్రత్యేక కానుకలు లేనట్లేనని తెలుస్తోంది. ఎందుకంటే ప్రభుత్వం ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. చంద్రబాబు సర్కారులో ప్రతి ఎడాది ఈ పథకం కోసం రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్లు ఖర్చు చేసేవారు. ఈ ఏడాది సంక్రాంతి సమీపిస్తున్న ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఎటువంటి నిర్ణ యం తీసుకోలేదని తెలుస్తోంది. ఒకవేళ ఇవ్వాలని అనుకుంటే జనవరి 1 నుంచే పంపిణీ చేయాల్సి ఉంది. దీని గురించి జిల్లాలో అటువంటి పరిస్థితి ఏమీ కనిపించడం లేదు. ఏడు నెలల కిందట అధికారంలోకి వచ్చిన చంద్ర బాబు ప్రభుత్వం ఐదుళ్లకు ముందు అమలు చేసిన అనేక పథకాలను పున రుద్ధరిస్తామని చెప్పుకొచ్చింది. చివరకు క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ కాను కలను కూడా అందిస్తామని హామీ ఇచ్చింది. ఆచరణలో మాత్రం కానుకల సంగతిని కూటమి పాలకులు మర్చిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రజలు ఎంతో ఆదరించిన చంద్రన్న సంక్రాంతి కానుకలు మళ్లీ ఇస్తారని లబ్దిదారులు ఆశిస్తున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఎటు వంటి ఆసక్తి చూపకపోతుండడంపై సంక్రాంతి కానుక పథకం అమలయ్యే అవకాశాలు దాదాపుగా కనిపించడం లేదు. మండలం వ్యాప్తంగా దాదాపు 20 వేల రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిపోవడంతో నెలనెలా పింఛన్లు, జీతాలకే గగ్గోలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో పలు సంక్షేమ పథకాలకు ప్రభుత్వం దూరంగా ఉన్నట్లు కనిపిస్తోంది.

ఛార్జీల బాదుడు, అప్పులు చేయడంలో దొందూదొందే

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విలేకరులతో మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

పన్నులు, ఛార్జీలతో ప్రజలను బాదడంలో, ప్రజల పేరుతో అప్పులు చేయడంలో వైసిపి, టిడిపి దొందూదొందేనని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. పులివెందులలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 7 నెలల్లోనే విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై రు.15,485 కోట్ల అదనపు భారం మోపిందన్నారు. త్వరలో భూములు, స్థలాలు, ఇళ్లపై 20 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచబోతున్నారని తెలిపారు. నగరాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాపై యూజర్ ఛార్జీలు విధించబోతున్నారని పేర్కొన్నారు. వస్తువుల రవాణాపై ఒక శాతం వరద సెస్సు వేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం శోచనీయమన్నారు. అప్పుల విషయంలో టిడిపి కూటమి తీరును ఎద్దేవా చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.లక్ష కోట్లపై చిలుకు అప్పు చేసిందన్నారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తిరుపాల్‌రెడ్డి, నాగరాజు, శివ, వెంగల్‌రెడ్డి, ధనుష్, అమర్‌నాథ్‌రెడ్డి, చిన్నకోట నాగరాజు, వినయ్ పాల్గొన్నారు.

బ్రెయిలీ స్ఫూర్తితో ముందుకెళ్లాలి : డిఎస్‌పి

నిత్యవసర సరుకులు అందిస్తున్న డిఎస్‌పి మురళీ నాయక్, సిఐ రమణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అంధుల ఆశాజ్యోతి లూయిస్ బ్రెయిలీ అని పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ పేర్కొన్నారు. బ్రెయిలీ 216వ జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల కమ్యూనిటీ భవ నంలో పులివెందుల రూరల్ సిఐ ఎస్‌వి రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిఎస్‌పి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బ్రెయిలీని స్ఫూర్తితోనే, తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీలో తాను చదువుకునే రోజుల్లో తన బాల్యమిత్రుడు, అంధుడైన శ్రీనివాసులుకు అన్ని రకాలుగా తోడ్పాటు నందించే వాడినని డిఎస్‌పి తెలిపిరు. పులివెందుల నియోజకవర్గ విభిన్నప్రతిభావంతులు తమ సమస్య ఏదైనా నిస్సంకోచంగా తనను కలిసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. వికలాంగుల హక్కుల చట్టం-2016 ప్రకారం విభిన్నప్రతిభావంతులను ఇబ్బంది పెట్టేవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. పులివెందుల పోలీసుశాఖ తరపున రూరల్ సిఐ ఎస్‌వి రమణ బ్రెయిలీ డే సందర్భంగా విభిన్నప్రతిభావంతులకు చేయూతనివ్వడం అభినం దనీయమన్నారు. అనంతరం సిఐ ఆర్థికసాయంతో రూ.30వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను 30విభిన్నప్రతిభావంత కుటుంబాలకు డిఎస్‌పి పంపిణీ చేశారు. ముందుగా కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా విభిన్న ప్రతిభా వంతుల నెట్‌వర్క్ ఆధ్వర్యంలో డిఎస్‌పి, సిఐని ఘనంగా సత్క రించారు. అభ్యుదయ వివాహం చేసుకున్న చిన్న, ప్రమీలను అభినందిస్తూ, ఆదర్శ అంధ దంపతులను ఘనంగా సన్మానించారు. వికలాంగుల శిక్షణా కార్యక్ర మాలకు తనవంతుగా రూ.10వేలు అందిస్తున్నట్లు డిఎస్‌పి ప్రకటించారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకట సుబ్బయ్య, సునీల్, కానిస్టేబుల్ పురుషోత్తమరెడ్డి, సంఘసేవకులు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచని గ్రామీణ రోడ్డు

అధ్వానంగా జడ్జిగారికొట్టాలు-సిద్ధారెడ్డిపల్లె రోడ్డు.. ఇక్కట్లలో ప్రజలు, రైతులు

గుంతలమయంతో దర్శనమిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని జడ్జిగారికొట్టాలు- సిద్ధారెడ్డిపల్లి గ్రామం దారి చాలా అధ్వానంగా ఉంది. కడప-కర్నూలు ప్రధాన రహదారి నుంచి జడ్జిగారి కొట్టాలు వద్ద నుంచి సిద్ధారెడ్డిపల్లి గ్రామానికి గ్రావెల్ రోడ్డు ఉంది. ఈ రోడ్డు గత కొంతకాలంగా మరమ్మతులకు నోచుకోలేదు. గుంతలతో దర్శనమిస్తోంది. కంకర బయట పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కొన్నేళ్లుగా ఈ రోడ్డును బాగు చేయాలని అధికారులు ప్రతిపాదనలు చేశారు. రూ.3 కోట్లతో టెండర్ కూడా ఆహ్వానించారు. అయితే కాంట్రాక్టరు పనులు ప్రారంభించకపోవడంతో టెండర్ రద్దు అయింది. ఈ మార్గంలో ప్రయాణించే వారికి ఇబ్బందులు తప్పడంలేదు. సిద్ధారెడ్డిపల్లి, సోమాపురం, మొర్రాయపల్లె గ్రామాల ప్రజలు మైదుకూరు, దువ్వూరు, చింతకుంట ప్రాంతాలకు ఈ మార్గం నుంచే ప్రయాణించాల్సి ఉంది. ద్వారకానగరం గ్రామ ప్రజలు సచివాలయం, ఇతర అవసరాల కోసం సిద్ధారెడ్డిపల్లి పంచాయతీకి రావాల్సిన ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీని పెంపొందించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 23న నేతాజీ శుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా నేతాజీ సోషల్‌స్టడీస్ క్లబ్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పద్మశాలి కల్యాణ మండపంలో సాంఘికశాస్త్ర ప్రతిభా పరీక్షను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం జిల్లా ఉప విద్యాశాకాధికారి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిం చడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి అవకాశం ఉంటుందన్నారు. క్లబ్ జిల్లా కన్వీనర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ ఇలాంటి పరీక్షల వల్ల విద్యా ర్థుల్లో పోటీ తత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గురుకుమార్, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు జమాల్‌రెడ్డి, సుబ్బయ్య, వన్నప్ప, మైసూర్, కృష్ణమోహన్, జమా ల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎట్టకేలకు సిసి రోడ్డు పనులు పునఃప్రారంభం



ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురం మెయిన్ రోడ్డులో గత ప్రభుత్వం చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు పునఃప్రారం భమయ్యాయి. దాదాపు రూ.3.90 కోట్ల వ్యయంతో శిరిడీ సాయిబాబా ఆలయం నుంచి బస్టాండ్ వరకు సిమెంట్ రోడ్డు పనులను గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. అనంతరం గత ఏడాది డిసెంబర్‌లో అసం పూర్తిగా ఉన్న సిమెంట్ రోడ్డును అప్పటి సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారం భించారు. పెండింగ్ పనులు ఉన్నప్పటికీ అధికారులు ప్రారంభోత్సవాన్ని చేయించారు. అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో పెండింగ్ పనులు నిలిచిపోయాయి. దీనికి తోడు బిల్లులు కూడా పెండింగ్ ఉండడంతో పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాల్లోని షాప్ యజమానులు అధికార పార్టీ నేతల దృష్టికి తీసుకొచ్చారు. పెండింగ్ పనులు కారణంగా తమ వ్యాపారాలు ఆశాజనకంగా లేవని మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఆయన స్పందిస్తూ పనులను చేపట్టేలా సంబంధిత అధికారులతో చర్చించి పునఃప్రారంభించారు.

త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు..

పెండింగ్‌లో ఉన్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. పనుల నాణ్యతగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- మహమ్మద్ యూసఫ్, ఆర్అండ్‌బి ఎఇ, సింహాద్రిపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ఉద్యోగ కల్పనే లక్ష్యం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే తమ లక్ష్యమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని అహోబిలపురం ఉన్నత పాఠశాలలో ఆదివారం మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్ చేసిన విద్యార్థులు నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. వీరి కోసం 27 కంపెనీల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 2,450 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారి నైపుణ్యాన్ని బట్టి సంబంధిత కంపెనీలు ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. నైపుణ్యం లేని వారికి స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ద్వారా శిక్షణిచ్చి మరో మూడు నెలల్లో జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్సీ తెలిపారు. గత ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చే దశగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ సహాయ సహకారాలతో ఇలాంటి కార్యక్రమాలను మరెన్నో చేపట్టనున్నట్లు వివరించారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

జాబ్‌మేళాలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కీలకం

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందులలో నిర్వహించిన జాబ్‌మేళా సజావుగా నిర్వహించడంలో ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కీలక పాత్ర పోషించినట్లు ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఆదివారం పులివెందులలో 2 వేల మందికి పైగా యువత జాబ్‌మేళాలో పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రిజిస్ట్రేషన్, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌తో సహా వివిధ పనుల్లో పాల్గొని జాబ్‌మేళాను విజయవంతం చేశారన్నారు. జాబ్‌మేళాను విజయవంతం చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్-9 విద్యార్థులకు డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ కుమార్‌రెడ్డి అభినందనలు తెలిపారు. జాబ్‌మేళాలో మాట్లాడిన హరిశంకర్ అనే విద్యార్థిని పలువురు ప్రశంసించారు.

బోగస్ పింఛనుదారుల ఏరివేతకు శ్రీకారం

- 17న మండలానికి ప్రత్యేక బృందాలు రాక

ప్రజాశక్తి - సింహాద్రిపురం

కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన అనంతరం బోగస్ పెన్షన్‌దారుల ఏరివేతకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన సదరం క్యాంప్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పంపిన ప్రతిపాదనలతో ఇస్తున్న పక్షవాతం, నరాల బలహీనత పెన్షన్లపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించనుంది. నరాల బలహీనత, పక్షవాతం కారణంతో పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల పరిశీలనకు ప్రభుత్వం మొదటగా శ్రీకారం చుట్టింది. మండల వ్యాప్తంగా ఇలాంటి పెన్షన్లు 35 మంది లబ్ధిదారులు పొందుతున్నట్లు ఇప్పటికే క్షేత్రస్థాయిలోని సచివాలయ సిబ్బంది ప్రభుత్వానికి నివేదిక పంపారు. వీరు నెలకు రూ.15 వేలు చొప్పున పెన్షన్ తీసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి పెన్షన్‌దారులు అక్రమమార్గంలో సర్టిఫికెట్లను పొందినట్లు కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో వీటిని మళ్లీ పరిశీలించేందుకు ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఈనెల 17న మండలంలో ప్రత్యేకబృందాలు తనిఖీ చేయనున్నాయి. ఆ 35 మంది పెన్షన్ దారుల వద్దకు వెళ్లి పరిశీలించనున్నట్లు ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. వీరు పరిశీలన రోజు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పథకాలపై వాస్తవాలను మాట్లాడాలి

ప్రజాశక్తి - చాపాడు

పి. మునిశేఖర్‌రెడ్డి

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వైసిపి నాయకులు, పార్టీ అధినేత వాస్తవాలను మాట్లాడాలని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మాట్లా డుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. 2019 మేనిఫెస్టోలో అధికారంలోకి వస్తే ఒక కుటుంబంలో ఎంతమంది బడికి పోయే పిల్లలు ఉన్నా రూ.15వేలు వేస్తామని మాట ఇచ్చి తప్పారని గుర్తు చేశారు. రైతు భరోసా పథకం కూడా కేంద్రంతో సంబంధం లేకుండా రూ.12వేలు రైతులకు ఇస్తామని మాట తప్పారన్నారు. ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలలకు అమలు చేసిన విష యం మర్చిపోయారన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం పథకం కింద జూన్‌లో రూ.20వేలు వేస్తా మన్నారు. టిడిపి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కేంద్రం ఇచ్చే డబ్బుతో కలుపుకొని రూ.20 వేలు రైతులకు ఏప్రిల్‌లో పంపిణీ చేస్తున్నామన్నారు.

యూనిఫారం లేకుండానే తనిఖీలు

బెంబేలెత్తుతున్న వాహనదారులు

ప్రజాశక్తి కమలాపురం/చింతకొమ్మదిన్నె



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవిఐ

కడప ఆర్‌టిఒ కార్యాలయంలో మోటర్ వెహి కల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తు న్నారు. యునిఫారం లేకుండా విధులు నిర్వహి స్తుండడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. గతంలో ఆయనపై ఇలాగే వ్యవహ రించడంతో ఉన్నతా ధికారులు చర్యలు తీసు కోవడంతో విఫల మవు తున్నారు. ఇటీవల ఆయన యూనిఫాం లేకుండా వాహనాలు తనిఖీ చేపట్టారు. దీంతో పలువురు వాహన దారులు ఆయన తీరుపై గుసగులాడుతున్నాయి. మీడియా వెళ్లి అడిగేసరికి అక్కడినుంచి మెల్లగా ఉడాయించారు. ఇంత జరుగుతున్నా కూడా ఉన్నతా ధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై వారే ఎంవిఐని వెనకేసు కొస్తున్నారని ప్రజల్లో చర్చ జరుగుతోంది. గుసగుసలాడుతున్నారు. ఇటీవల కాలంలో ఆయనపై సిద్ధవటం మండలం భాకరాపేట దగ్గర ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వాహనాలను యూనిఫాం లేకుండా తనిఖీలు చేపట్టారు. దీంతో ఆయ నపై వారు నకిలీ ఆర్‌టిఒ అని తిరగబడిన సంఘటనలున్నాయి. అయినా యధాతథంగానే యూనిఫారం లేకుండానే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ విషయంపై డిటిసిని వివరణ కోరగా ఆయనపై గతంలోనూ ఇలాంటి ఆరోపణలు వచ్చాయని, గత డిసెంబర్‌లో కూడా కమిషనర్ కార్యాలయం నుంచి మెమో కూడా జారీ చేశారని చెప్పారు. ఈ విషయంపై విచారించి విజయ్‌భాస్కర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డిటిసి చెప్పారు.